www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 27 మార్చి 2025
5
అన్నమయ్య

విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రెండో రోజులు నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

జడ్‌పి చైర్మన్ ఎన్నిక నేడే!

- క్యాంపు నుంచి జిల్లాకు చేరిన జడ్‌పిటిసిలు
- సర్వం సిద్ధం చేసిన జిల్లా అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక నిర్వహణకు సర్వం సిద్ధమైంది. జిల్లా పరిషత్ అధికార యంత్రాంగం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధ్యక్షతన గురువారం నిర్వహించనున్న ఎన్నికకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేసింది. ఇప్పటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు దఫాలుగా జిల్లాలోని 50 మంది జడ్‌పిటిసిల్లో ఒంటిమిట్ట, పులివెందుల జడ్‌పిటిసిలు మినహా 48 మందికి చైర్మన్ ఎన్నిక నిర్వహణకు సంబంధించిన నోటీసులు జారీ చేసింది. జిల్లా పరిషత్ సమావేశ హాలులో జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక నిర్వహణలో అనుసరించాల్సిన విధివిధానాలపై కసరత్తు చేసింది. వైసిపి జిల్లా నాయకత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జడ్‌పిటిసిలను హైదరాబాద్ నగరంలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించింది. సుమారు 36 నుంచి 41 మంది జడ్‌పిటిసిలను తరలించింది. మూడ్రోజుల అనంతరం బుధవారం రాత్రి 10 గంటల సమయానికి జిల్లా కేంద్రానికి తరలించింది. అనంతరం రాత్రి పూట నిర్వహించనున్న ప్రత్యేక శిబిరానికి తరలించింది. రాత్రి పూట రెండవ దఫా నిర్వహించనున్న శిబిరంలో చైర్మన్ అభ్యర్థి బ్రహ్మంగారిమఠం జడ్‌పిటిసి రామగోవిందరెడ్డి గెలుపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు చేసినట్లు తెలిసింది. అనంతరం గురు వారం ఉదయం 10.30 గంటల సమయంలో జడ్‌పి సమావేశ హాలులో చైర్మన్ ఎన్నిక సమయానికి హాజరు పరిచేలా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఉదయం 11 గంటలకు జడ్‌పి చైర్మన్ ఎన్నిక ప్రక్రియ జరగనుంది. మరోవైపు జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక నిర్వహణపై జిల్లాలోని గోపవరం, ఒంటిమిట్ట, పులివెందులకు చెందిన పలువురు కోర్టుకు వెళ్లిన సంగతి తెలిసిందే. రాత్రి ఏడు గంటల అనంతరం కోర్టు ఎటువంటి ఆదేశాలు జారీ చేస్తుందనే ఉత్కంఠ నెలకొంది.

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఉద్యమిస్తాం

-సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పేదల సమస్యలు జాప్యం చేస్తూ, ఎన్నికల హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలతో కలసి ఉద్యమిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజాసమస్యలు పరిష్కారం చేయాలంటూ స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఈ నెల 15 నుంచి 22 వరకు ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా ప్రజలను కలసి వారి సమస్యలను జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో నీటి సమస్యను ఎమర్జెన్సీగా ప్రకటించాలని అన్నారు. గాలివీడు మండలం తూముకుంట సోలార్ రైతులకు పంట నమోదు చేయడంలో అధికారులు విఫలమయ్యారని పేర్కొన్నారు. సంబేపల్లి దుద్యాల దళితవాడ, 8 గ్రామాల్లో దాదాపు 250 మంది రైతులు తమ అనుభవంలోని భూములు సుండుపల్లి మండలంలో ఉన్నాయనే నెపంతో పట్టా పాస్‌బుక్కులు ఇవ్వలేదని అధికారుల తీరుపై మండిపడ్డారు. ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం నష్ట పరిహారం చెల్లించడంలో ప్రభుత్వ జాప్యం తగదని చెప్పారు. సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో 20 దళిత గ్రామాలకు శ్మశాన వాటికలు లేక ఇబ్బందులు పడుతు న్నారని పేర్కొన్నారు. ఎజి గార్డెన్, రాజులకాలనీ, రాయుడుకాలనీ, ఎగువ అబ్బవరం కాలనీలలో సిసి రోడ్లు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలన్నారు. నెల రోజుల్లో సమస్యలు పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున కలెక్టరేట్ ముట్టడి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.మణి, సీనియర్ నాయకుడు హరిశర్మ, నాగరాజు, గాయత్రి, రమేష్‌బాబు, వెంకట్రామిరెడ్డి, ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు భాగ్యలక్ష్మి, లక్ష్మీదేవి, ఓబుళమ్మ, సురేఖ, సిద్దమ్మ సోలార్ రైతులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వాలకు కడప ఉక్కుపై ఆసక్తి లేదు

'కడప ఉక్కు-ఆంధ్రుల హక్కు' సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి

సదస్సులో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి కడప ఉక్కుపై ఆసక్తి లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు పట్టణ కమిటీ కార్యదర్శి సత్యనారాయణ అధ్యక్షతన 'కడప ఉక్కు-ఆంధ్రుల హక్కు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విభజన చట్టం 2014 పార్లమెంట్ హామీ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం సెయిల్ ఆధ్వర్యంలో నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. విభజన ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగాలు పెరగాలన్న దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం రాయలసీమ అభివృద్ధి కావాలన్నా కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం తప్పనిసరని పేర్కొన్నారు. విభజన చట్టంలోని హామీలు ఏ ఒక్కటి నేటి వరకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమలు చేయలేదని తెలిపారు. కేంద్రంలో రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్, వైసిపిలు కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణంపై ఆసక్తి కనబరచడం లేదని విమర్శించారు. 2025 రాష్ట్ర బడ్జెట్లో గానీ కేంద్ర బడ్జెట్‌లో గానీ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో కొలువుతీరిన బిజెపి మైనార్టీ ప్రభుత్వం అడగకపోయినా రాష్ట్రంలోని పాలక ప్రతిపక్ష పార్టీలు టిడిపి వైసిపిలు మద్దతిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రానికి నిధులు కేంద్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని ఇప్పటికైనా రాష్ట్రంలోని పాలక ప్రతిపక్షాలు బిజెపి వైఖరికి వ్యతిరేకంగా ఉద్యమ బాట పట్టాలని పిలుపునిచ్చారు. రాయలసీమలోని కాటన్ మిల్లులు, పాల పరిశ్రమలు, ఆల్విన్ సంస్థలు, నూనె మిల్లులు, పేపర్ మిల్లులు అనేక మూతపడ్డాయని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన ద్వారా వచ్చిన ఒకే ఒక్క కడప ఉక్కు ఫ్యాక్టరీ కూడా శంకుస్థాపనల, పరిశ్రమగాను టెంకాయలు కొట్ట డానికి రూ.10 కోట్లు ఖర్చు చేసిన వైనం ఆశ్చర్యంగా ఉందన్నారు. రాయలసీమ సమగ్ర అభివృద్ధికి రూ.500 కోట్లు ఇస్తానని పార్లమెంటులో ప్రకటించిన బిజెపి ప్రభుత్వం రూ.50 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. రాయలసీమలో ఉన్న ఎపిజిబి బ్యాంకును, కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను రాజధాని అమరావతికి తరలించారని గుర్తు చేశారు. జిల్లాలోని ప్రతి గ్రామం నుండి పార్లమెంట్ వరకు కడప ఉక్కు ఉద్యమం వాణి వినిపించాలని సిపిఎం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్, అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీ, సిపిఎం సీనియర్ నాయకులు బయన్న, జమ్మలమడుగు, పులివెందుల, మైదుకూరు మండలాల కార్యదర్శులు ఏసుదాసు, గఫూర్, షరీఫ్, నాయకులు డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ సురేష్, ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, లాయర్ హరిత, ప్రొద్దుటూరు పట్టణ కమిటీ సభ్యులు బాబు, సర్వేశ్వరమ్మ, వెంకటసుబ్బయ్య, నాగలక్ష్మి, రాములమ్మ, కృష్ణారెడ్డి, డివైఎఫ్ఐ నాయకులు విశ్వనాథ్, డేవిడ్, ఎస్ఎఫ్ఐ నాయకులు రాహుల్, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

సదస్సుకు హాజరైన ప్రజలు, కార్యకర్తలు

లక్ష గృహాలకు సోలార్ ఏర్పాటే లక్ష్యం

- విద్యుత్ ఎస్ఇ రమణ

మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఇ ఎస్.రమణ

ప్రజాశక్తి - కడప

లక్ష గృహాలకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు వైఎస్ఆర్ కడప జిల్లా విద్యుత్ ఎస్ఇ ఎస్.రమణ తెలిపారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు లక్ష్యం సాధనపై కడప విద్యుత్ భవన్‌లోని ఎస్ఇ ఛాంబర్లో సంస్థాపన వెండర్స్‌తో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిలో వాట్ సామర్థ్యంకు రూ.30 వేలు, రెండుకైతే రూ.60 వేలు, మూడుకైతే రూ.78 వేల చొప్పున ప్రభుత్వం రాయితీ అందిస్తుందని తెలిపారు. రాయితీ పోను మిగిలిన మొత్తంకు తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు ఇస్తుందన్నారు. బిసి కేటగిరీ వారికి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు అధనంగా మరో రూ.20 వేలు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ పథకం గృహ వినియోగదారులకి మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. కడప జిల్లాలో 67,374 మంది వినియోగదారులు నమోదు చేసుకున్నారని తెలిపారు. సోలార్ రూఫ్ టాప్ పనులు పూర్తయిన వారికి సబ్సిడీ మొత్తం వారి బ్యాంకు ఖాతాలలో జమైనామయని తెలిపారు. రానున్న కాలంలో విద్యుత్ వాహనాల ప్రాధాన్యత అధికంగా ఉంటుందన్నారు. సౌరశక్తి ద్వారా విద్యుత్తు ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవడం వల్ల వచ్చే లబ్ధిపై ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ యల్లారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోహన్, జూనియర్ ఇంజినీర్ సుధీర్, సంస్థాపక వెండర్స్ పాల్గొన్నారు.

వైద్య బృందంతో డాక్టర్ ముంతాజ్ ఆలీ

స్వాస్థ్య ఆస్పత్రిలో వైద్య సేవల విస్తరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రజల ఆరోగ్య సంరక్షణను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో, స్వాస్థ్య హాస్పిటల్స్ ఆధునిక వైద్య సదుపాయాలతో సేవలను మరింత విస్తరించింది. సత్సంగ్ ఫౌండేషన్ ప్రాజెక్టుగా పద్మభూషణ్ డాక్టర్ ముంతాజ్‌ఆలీ ఆధ్వర్యంలో కోవిడ్-19 మహమ్మారి సమయంలో సత్సంగ్ ఫౌండేషన్‌లో కేంద్రమంత్రి నితిన్ గడ్కరి స్వాస్థ్య ఆస్పత్రిని ప్రారంభించారు. వైద్యసేవలను విస్తృతం చేస్తూ 64-స్లైస్ టోటల్ బాడీ సిటీ స్కానర్, గర్భిణుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించి సురక్షిత ప్రసవానికి తోడ్పడే ప్రత్యేక విభాగం, పురిటి పిల్లల నుంచి పెద్దపిల్లల వరకు వైద్యసదుపాయం కల్పించే ఇ-విభాగాలను డాక్టర్ ముంతాజ్ ఆలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి డైరెక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ స్వాస్థ్య హాస్పిటల్‌లో 15వేల అవుట్ పేషంట్ సేవలు, 230 మంది ఇన్ పేషెంట్స్‌కు వైద్యం, 18వేల మందికి అవుట్ రీచ్ ఆరోగ్య శిబిరాల ద్వారా వైద్య సేవలు,34 శస్త్ర చికిత్సలు, 5 సిజేరియన్ ఆపరేషన్లు అత్యల్ప ఖర్చుతో నిర్వహించడం జరుగుతోందన్నారు. ఆల్ట్రాసౌండ్ - హెచ్ఎన్ బి అందించిన ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ - పూణే వారికి, సీటీ స్కాన్ అందించిన అజయ్ భాటియా, కేంబ్రిడ్జ్ ఇన్స్టిట్యూషన్ వారికి సత్సంగ్ ఫౌండేషన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపుతున్నామని అన్నారు. కార్యక్రమంలో సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ డాక్టర్ ముంతాజ్‌ఆలీ,డాక్టర్ శోభ, వెంకట్, సత్సంగ్ ఫౌండేషన్ సభ్యులు, వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అన్నమయ్య 522వ వర్ధంతి

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని శ్రీసత్య సాయిబాబా దేవస్థానంలో బుధవారం పద కవితా పితామహుడు శ్రీఅన్నమయ్య 522వ వర్ధంతి తిరుపతి శ్రీ అన్న మాచార్య కళాక్షేత్రం పిఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయ శంకర స్వామి సౌజన్యంలో అన్న మయ్య సంకీర్తన ఆలాపన లక్కిరెడ్డిపల్లి శ్రీ వెంకటేశ్వర కళామండలి (ఎస్‌వి ఆర్‌డిఎస్) అధ్యక్యులు తుమ్మల హరినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్రేగా గాయకులు తుమ్మల హరినాథ్ మాట్లాడుతూ కలియుగ శ్రీ వెంకటేశ్వర స్వామి మీద 32 వేల సంకీర్తనలు రచించి గానం చేసిన ఘనత అన్నమయ్యకే దక్కిందన్నారు. తిరుమల కొండపై గతంలో అన్నమయ్య ఇంటిని గతంలో కూల్చి వేశారని ప్రస్తుతం అన్నమయ్య ఇంటిని టిటిడి ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్మించాలని కోరారు. కళాకారులు, భక్తులు, అన్నమయ్య వర్ధంతి సందర్భంగా కీర్తనలు ఆలపిం చినారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లాలోని కళాకారులు రెడ్డయ్య, రిటైర్ టీచర్ భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవి, సరోజ, నాగలక్ష్మి, భాస్కర్‌రెడ్డి, నారమ్మ, భాగ్యమ్మ, లక్ష్మీదేవి, సిద్దమ్మ, శివరామయ్య, పెంచలయ్య, రమణ, చంద్రయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

అన్నమయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

ఇఫ్తార్ విందు పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ఈ నెల 28న స్థానిక వజ్రం కల్యాణ మండపంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి ఆధ్వర్యం లో నిర్వహించనున్న ఇఫ్తార్ విందుకు రాజంపేట నియోజక వర్గం లోని ముస్లిము సోదరులందరు విచ్చేసి విజయవంతం చేయాలని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎండి జాహిద్‌అలీ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆకేపాటి భవన్‌లో పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో వైసిపి మైనారిటీ పట్టణ అధ్యక్షులు పఠాన్‌మసూద్ అలీఖాన్, నియోజకవర్గం అధ్యక్షులు పఠాన్‌ఖాజా మొహిద్దీన్, సీనియర్ నాయకులు నజీర్ అహ్మద్, ఇలియాస్, సత్తార్, డాక్టర్ అంజద్ అలి ఖాన్, నాసిర్, షాకిర్, రహమాతుల్లా పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : రేషన్ కార్డ్ దారులు ఈనెల 31వ తేదీలోగా తప్పకుండా ఇకెవైసి చేసుకోవాలని 24వ వార్డు ఇన్‌ఛార్జి తలారి రాధమ్మ, రేషన్ డీలర్ కళాధర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు.. రేషన్‌కార్డు లబ్ధిదారులు తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాలన్నారు. మదనపల్లె రూరల్, మున్సి పల్ పరిధిలో 1,95,000 మంది రేషన్ కార్డు లబ్ధిదారులు ఉండగా, ఇప్పటికే 1,75,000 మందికి పైగా ఇకెవైసి పూర్తయిందని తెలిపారు. ఇంకా 19 వేలకు పైగా ఇకెవైసి పెండింగ్‌లో ఉందని వారందరూ తప్పక ఇకెవైసి చేసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డు లబ్ధిదారులు ఆయా ప్రాంతాల్లో ఉన్న డీలర్లను కానీ, బియ్యం విక్రయించే వాహన దారులు, విఆర్‌ఒలను సంప్రదించి ఈకేవైసీను పూర్తి చేయించుకోవాలన్నారు. ఈనెల 1వ తేదీ నుంచి ఇకెవైసి చేసు కున్న వారికి మాత్రమే బియ్యం సరఫరా జరుగుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా వలసలు వెళ్లిన వారే ఎక్కువగా పెండింగ్ ఉందని వారు ఇకెవైసి చేసుకోవాలని తెలిపారు. 24వ వార్డులో దాదాపు 300 మందికి ఇకెవైసి పెండింగ్ ఉండడంతో డీలర్ కళాధర్, రేషన్ వాహన దారుడు బాబు ఆ ప్రాంతంలో ఇంటింటికి తిరిగి ఇకెవైసి చేయించారు.

టౌన్ ప్లానింగ్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి-కడప అర్బన్ : పుర, నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే భవన నిర్మాణాలకు ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాలపై బుధవారం కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల ఎల్‌టిపి, ప్రణాళిక సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిడిటిపి విజయ భాస్కర్ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో నిబంధనలను మరింత సరళీకరిస్తూ రాష్ట్ర పురపాలక శాఖ జిఒ నంబర్లు 3, 4, 5, 7, 20 జారీ చేసిందని తెలిపారు. ఈ నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలు చేపట్టేవారు స్వీయ ధ్రువీకరణతో ఎల్‌టిపిల ద్వారా 24 గంటల్లోపే ప్లాన్ అప్రూవల్ పొందవచ్చన్నారు. ప్రణాళికా సిబ్బంది భవన నిర్మాణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని చెప్పారు. 300 చదరపు మీటర్ల లోపు భవనాలకు యజమానులే ప్లాన్ ధ్రువీకరించి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆర్కిటెక్చర్లు, ఇంజినీర్లు, టౌన్ ప్లానర్లు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. లేఅవుట్‌కు తప్పకుండా అనుమతులు ఉండాలని పేర్కొన్నారు. సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీం క్రింద భవన నిర్మాణ అనుమతులను అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ జారీ చేస్తూ ఉండేదని, పట్టణ స్థానిక సంస్థలు జారీ చేస్తాయని తెలిపారు.

వన్యప్రాణుల కోసం నీటి తొట్లు ఏర్పాటు

ప్రజాశక్తి-కడప అర్బన్ : జెబివిఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి, వింగ్స్ ఆఫ్ హ్యుమానిటీ సంయుక్త ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంక్షేమం కోసం గువ్వల చెరువు ఘాట్‌లో నీటి తొట్లను ఏర్పాటు చేశారు. జెబివిఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి వ్యవస్థాపకుడు అశోక్ మాట్లాడుతూ ఘాట్ చుట్టుపక్కల అడవి ప్రాంతాల్లో ఉన్న వన్యప్రాణులకు నీటి కొరతను తగ్గించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అడవి ప్రాణులను రక్షించేందుకు ఇంకా మరెన్నో కార్యక్రమాలుకు సంస్థ నడుం బిగిస్తుందన్నారు. కమిటీ సభ్యులు కాశీ మాట్లాడుతూ గువ్వల చెరువు ఘాట్‌లో ఐదు ముఖ్యమైన ప్రాంతాలలో తొట్లు పెట్టామని తెలిపారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహిళలు ఆర్థిక స్వావలం సాధించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆకాంక్షించారు. బుధవారం మదనపల్లి మున్సిపల్ టౌన్ హాల్లో మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ప్రతి ఇంటికి గొప్ప వెలుగులని అన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటే ఆ కుటుంబం ఎంతో సంతోషంగా జీవనం కొనసాగిస్తుందని తెలిపారు. ప్రభుత్వం మహిళా ఆర్థిక స్వావలంబన కోసం ఎన్నో అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. కుట్టు మిషన్ల శిక్షణను ఇస్తూ ఉచితంగా కుట్టు మిషన్లు అందించడం ద్వారా మహిళలు ఇంటి వద్దనే ఉంటూ ఆర్థికంగా కొంత వెసలు బాటు కలుగుతుందని అన్నారు. ప్రతి మహిళ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని సద్వినియోగం చేసుకొని రాణించాలని కోరారు. కార్యక్రమంలో మదనపల్లె మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపిడిఒ తాజ్ మహల్, మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్యే తనిఖీ : మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్ని వార్డులను తిరిగి, అక్కడున్న రోగలను పరామర్శించి అందుతున్న వైద్య సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని వైద్యులు, వైద్య సిబ్బందికి సూచించారు. అత్యంత సీరియస్ కేసు అయితే తప్ప రెఫర్ చేయొద్దని సూచించారు. ఇక్కడే అన్ని సదుపాయాలు కల్పించాలని తెలిపారు. అనంతరం మండలంలోని గుట్ట కిందపల్లెకు చెందిన రైతు శంకర్‌పై ఇటీవల కొత్తపల్లి మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి దాడి చేయడంతో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో ఆయనను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని, తప్పక న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట వైద్యులు, వైద్య బృందం, టిడిపి నాయకులు ఉన్నారు.

డిఎస్‌సి 2వ విడత శిక్షణకు ఎంపికలు

ప్రజాశక్తి-కడప అర్బన్

డిఎస్‌సి రెండవ విడత శిక్షణకు ఎంపికలు ఈ నెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జ్ఞానభూమి పోర్టల్‌లో వెబ్ ఎంపిక సేవ ప్రారంభమైందని తెలిపారు. షార్ట్ లిస్ట్ చేయబడిన అభ్యర్థులు తమ వెబ్ ఎంపీలను సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. డిఎస్‌సి ఎంపికల కోసం షార్ట్ లిస్టు చేయబడిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల జాబితా వెబ్ పోర్టల్ లో ప్రదర్శించినట్లు తెలిపారు. ఫేస్ వన్ వెబ్ ఎంపికకు ఎడిట్ ఆప్షన్ లేదని పేర్కొన్నారు.

టెక్ ఫెస్ట్‌లో విజయం సాధించిన విద్యార్థులతో కళాశాల బృందం

జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్‌లో 'అన్నమాచార్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఇటీవల నిర్వహించబడిన జాతీయస్థాయి టెక్నికల్ ఫెస్ట్‌లో అనమాచార్య యూనివర్శిటీ విద్యార్థులు తమ సాంకేతిక ప్రతిభతో అనేక బహుమతులు గెలుచుకొని విశిష్టంగా నిలిచారని యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఇ.సాయిబాబారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.మల్లిఖార్జునరావు, ప్రిన్సిపల్ ఎస్ఎంవి నారాయణ తెలిపారు. టెక్‌ఫెస్ట్‌లో విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెక్ ఫెస్ట్‌లో 'స్లైడ్ డెక్' ఈవెంట్‌లో ఎం.భార్గవి, విజయ్ కుమారి, ఎం.విజయకుమారి, పి.శివాని బహుమతి అందుకున్నట్లు తెలిపారు. 'పోస్టర్ ప్రెజెంటేషన్' ఈవెంట్‌లో ఎం.వైష్ణవి విశేష ప్రతిభను ప్రదర్శించి బహుమతి సాధించిందన్నారు. 'టెక్నికల్ క్విజ్' విభాగంలో వి.ప్రవీణ్, కె.హిందుజా, ఎన్.వేణు మాధవ్ విజేతలుగా నిలిచారని అన్నారు. ఈ విజయాలను సాధించిన విద్యార్థులంతా సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందినవారు కావడం విశేషమని తెలిపారు. ఈ విజయాలు విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలను, కళాత్మకతను ప్రతిబింబిస్తాయని, వారిని మరింత ప్రోత్సహించి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించిన అధ్యాపకుల కృషిని కూడా వారు ప్రత్యేకంగా ప్రశంసించారు.

పేద కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్ : క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం ఇచ్చే గొప్ప సందేశమని కొండూరు అజంతుల్లా బుధవారం నిరుపేదలకు రంజాన్ పండగకు కావాల్సిన నిత్యావసర వస్తువుల సామగ్రిని కొండూరు సున్ హేర ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. మసాపేట నీళ్ల ట్యాంక్ వీధిలోని ఆయన నివాసంలో 750 పేద కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో నెల రోజులపాటు ఎంతో నియమనిష్టలతో ముస్లిము సోదరులు కఠిన ఉపవాస దీక్ష ఆచరిస్తారని అన్నారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం ఇచ్చే గొప్ప సందేశమని తెలిపారు. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు కొండూరు అయేషా, రహమత్ బి, హబీబుల్లా, యాస్మిన్, జుబెర్ అహమ్మద్, జులహేక, సమీయుల్లా, ఫార్షద్, పాలగిరి మొహమ్మద్, సుంకేసుల వన్నూరు భాష, షేక్ నిసార్, జక్రియ పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దాతలు

తాగునీటికి పైపులైన్ తీస్తున్న జెసిబి

తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని డి.రాచపల్లి పంచాయతీ పెద్దూరుకస్పాలో భూమి లోపల తాగునీటి పైపులైన్‌కు వేరులు అడ్డుపడంతో తాగునీటి సరఫరా నిలిచి పోయింది. తాగునీటి కోసం ప్రజల ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఈనెల 2న ప్రజాశక్తి దినపత్రికలో 'తాగునీటి సమస్యను పరిష్కరించండి' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన సర్పంచ్ సిద్ధవటం నాగులమ్మ, పంచాయతీ సెక్రటరీ సంజీవరెడ్డి ముమ్మరంగా తాగునీటి పైపులైను మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దాదాపు 300మీటర్లు రోడ్డు పక్కన జెసిబి సహాయంతో కాల్వ తీసి పైపులైను ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. వేసవి కాలంలో గ్రామంలో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు నిధులు లభ్యతను బట్టి ప్రాధాన్యత క్రమంలో అన్ని పనులు చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రవి, చాంద్ బాషా, అబ్దుల్లా, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ వినియోగదారులపై కొరడా

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని దేవమాచుపల్లి, మైలపల్లి గ్రామాలలో బుధవారం డిపిఇ బృందం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. స్థానిక ఎఇ చలపతిని వివరణ అడగగా కడప నుంచి వచ్చే డిపి ఇ స్క్వాడ్ ఎవరికి సమాచారం ఇవ్వరని తదుపరి రెండు రోజుల్లో వారికి నోటీసులు పంపించడం జరుగుతుందని తెలిపారు. చాలామంది గ్రామాల్లో విద్యుత్తు వినియోగంపై వారి వారి అవసరాలకు తగ్గట్టుగా అడిషనల్ లోడ్ పెంచుకుంటే విద్యుత్ అంతరాయాలను అరికట్టవచ్చని అన్నారు. వినియోగానికి సరిపడా విద్యుత్‌ను వాడుకునేందుకు వీలు ఉంటుందని అన్నారు.

నేడు గారాలమడుగు రీసర్వేపై గ్రామసభ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని గారాల మడుగు పంచాయతీ కార్యాలయంలో రీసర్వేపై గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ అరవింద్‌కిషోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రీసర్వేలో భాగంగా రెండవ పేస్‌లో మండలంఓని గారాలమడుగు, పుత్తనవారిపల్లి గ్రామాలు ఎంపిక అయ్యాయని తెలిపారు. గ్రామంలోని రైతులందరూ రెవెన్యూ సర్వే అధికారులకు సహకరించి వారి భూముల కొలతలు వేయించు కొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. 28న ఉదయం 10 గంటలకు పుత్తనవారిపల్లె పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహిస్తారని అక్కడి ప్రజలు, రైతులు పాల్గొనాలని తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నరసింహులు

ప్రజాశక్తి -నందలూరు

దాసరి నరసింహులు

మహమ్మద్ అలీ

మండలంలోని నందలూరు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో బుధవారం జరిగిన బార్ అసోసి యేషన్ ఎన్నికలలో దాసరి నరసింహులు ఐదవ సారి అధ్యక్షులుగా ఎన్నిక య్యారు. ఈ ఎన్నికలకు ఒవి.కృష్ణారెడ్డి పరిశీల కులుగా వ్యవహరించగా దాసరి నర్సింహులు, షమీ ఉల్లాఖాన్ పోటీ పడడం జరిగిం ది. ఓటింగ్ లో 21 మంది న్యాయవాదులు పాల్గొనగా ఐదు ఓట్ల మెజారి టీతో దాసరి నర్సింహులు గెలుపొంది బార్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను తిరిగి అధ్యక్షులుగా ఎన్నుకు న్నందుకు సంతోషంగా ఉందని, న్యాయవాదుల సంక్షేమం కోసం, నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు క్రొత్త భవంతి నిర్మాణం కోసం ప్రయత్నిస్తానని చెప్పారు. అనంతరం తన గెలుపునకు సహకరించిన సహ న్యాయవాదుల మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నుకొన్న అనంతరం ఉపాధ్యాక్షులుగా షేక్ మహమ్మద్ అలీ, జనరల్ సెక్రటరీగా గొబ్బిళ్ళ సుబ్బరామయ్య, జాయింట్ సెక్రటరీగా నాయన పల్లి అను దీప్ జై సింహ, ట్రెజరర్ గా వినయ్ కుమార్, లైబ్రరీ సెక్రటరీగా స్వేచ్ఛ, మహిళ రిప్రజెంటేటివ్‌గా మాడపూడి నళిని, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్‌గా ఒవి.కృష్ణారెడ్డి, హెచ్.ఆనంద్‌కుమార్, డి.మల్లికార్జున, ఆకేపాటి శివకుమార్‌రెడ్డిలను ఎగ్జిక్యూటివ్ బాడీలుగా నియమించారు.

రేపు 'ఉపాధి'పై సమీక్ష

ప్రజాశక్తి - గాలివీడు

ఉపాధి హామీ పథకానికి సంబంధించి శుక్రవారం ఉదయం 10 గంటలకు ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సిఎ.జవహర్‌బాబు పేర్కొన్నారు. 1-3-2023 నుంచి 31-3-2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనులు సంబంధించి కూలీల రేట్లు రూ.11 కోట్లు, హార్టికల్చర్‌కు సంబంధించి రూ.30 లక్షలకు ఈనెల 14 నుంచి 27వ తేదీ వరకు గ్రామాలలో ఉపాధి హామీ సిబ్బంది డిఆర్‌పిలు, ఎస్‌ఆర్‌పిల సమస్యలపై గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం తయారు చేసిన రిపోర్టును ఓపెన్ ఫోరంలో ప్రస్తావించడం జరుగుతుందని పేర్కొన్నారు.

వేలంలో పంచాయతీకి రూ.90 వేలు ఆదాయం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

వేలంపాట నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

కోసువారిపల్లి పంచాయతీకి వారపు సంత వేలం ద్వారా రూ.90 వేలు ఆదాయం వచ్చినట్లు సర్పంచ్ విజయలక్ష్మి రఘు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావులు తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో వారపు సంత వేలంపాట జరిగింది. ఖాసీంసాబ్ రూ.90 వేలకు వేలంపాటలో దక్కించు కున్నారని తెలిపారు.కార్యక్రమంలో నాయకులు, పాటదారులు పాల్గొన్నారు.

సిఎం యాప్‌లో పంట నమోదు చేసుకోండి : డిఎఒ

ప్రజాశక్తి-రామాపురం

రైతులకు అవగాహన కల్పిస్తున్న డిఎఒ చంద్రానాయక్

కందిపంట సాగు చేసుకున్న రైతులు కందులను ప్రభుత్వ ఏర్పాటుచేసిన విక్రయ కేంద్రా లలో విక్రయించాలంటే సిఎం యాప్‌లో పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ రైతులకు సూచించారు. మండలంలోని బండపల్లి పంచాయతీ వెంకటొడ్డిగారిపల్లె బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందులు విక్ర యించే రైతులు సిఎం యాప్‌లో నమోదు చేసుకొని ఉంటే రాయచోటి మార్కెట్ కమిటీ యార్డులో ఏర్పా టు చేసిన కందులు కొనుగోలు కేంద్రంలో క్వింటాల్‌కు రూ.75వేలు కనీసమద్దతు ధరగా కొనుగోలు చేస్తారని సూచించారు నూతన వ్యవసాయ పద్ధతులను తెలిపేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ యాప్ లను ప్రవేశ పెట్టాయని భూమికి సంబంధించి విశిష్ట సంఖ్య గల ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకొని భవిష్యత్తులో ప్రభుత్వాలు అందించే పథకాలు పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట నష్టం వ్యవసాయ అనుబంధ సంస్థలు అందించే పథకాలకు అర్హత పొందగలరని అన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు జయరాణి, ఎంఎఒ వై.నాగ మణి, బండపల్లి రైతు సేవ కేంద్రం సహాయకులు మంజుల, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు

మామిడి తోటల సస్యరక్షణపై అవగాహన

సస్యరక్షణ చర్యలను రైతులకు వివరిస్తున్న ఉద్యానవనశాఖ అధికారులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం అనంతరాజుపేట కళాశాల కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శారద, రాజంపేట కోడూరు ఉద్యాన అధికారులతో కలిసి పెనగలూరు మండలంలోని కొండూరు, ఈటి మార్పురం, సిద్ధవరం రైతు సేవ కేంద్రాలు, రైల్వేకోడూరు మండలంలోని సెట్టిగుంట, చియ్యవరం, మరవారిపల్లె రైతు సేవా కేంద్రాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పురుగులు, తెగుళ్లసస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం మామిడిలో నల్ల తామర పురుగులు, తేనె మంచు పురుగు ఉధృతి ఉన్నట్టు గమనించడం జరిగిందని డాక్టర్ శారద తెలిపారు. మామిడి రైతులు తామర పురుల నివారణకు నీలిరంగు జిగురు అట్టలను ప్రతి చెట్టుకు అమర్చుకోవాలని రైతులకు సూచించారు. తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ లేదా స్పైనోసాడ్ 0.4 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. తోటలలో పూత,పిందె రాలుటను నివారించుటకు ప్లానోఫిక్స్ 0.25 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. ప్రతి పిచికారిలో స్టికింగ్ ఏజెంట్ తప్పనిసరిగా వాడాల్సిందిగా రైతులకు తెలిపారు. రైతులు ఎటువంటి సింథటిక్ పైరత్రాయిడ్స్ మందులు వాడకాన్ని మామిడిలో చేపట్టకూడదని తెలిపారు.పూమొగ్గ దశలో తేనెమంచు పురుగు, పక్షి కన్ను తెగులు, బూడిద తెగులు ఆశించే అవకాశం అధికంగా ఉన్నందున మొదటి పిచికారీ మోనోక్రోటోఫాస్ 1.6 మి.లిం కార్బెండిజమ్ 1గ్రాములు, వేప నూనె (1500 పిపిఎం) 2 మి.లీ. జిగురు మందు 0.5 మి.లి (లేదా) క్లోరి ఫైరిఫాస్ 50 ఇసి 2 ఎంఎల్ మ్యాం కోజెబ్ 2 గ్రాములు వేప నూనె 1500 పిపిఎం 2మి.లీ. లీటర్ నీటికి కలిపి చెట్టు కాండము, కొమ్మలు, ఆకులు బాగా తడుచేలా మందులను పిచికారి చెయ్యాలని సూచించారు. కాయ దశలో పండు ఈగ నివారణకు ఎకరాకు ఆరు చొప్పున పండుఈగ ఎరలను రైతులు సామూహికంగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఫ్రూట్ కవర్స్ వినియోగించడం వల్ల మంచి నాణ్య తతో కూడిన పండ్లను ఎగుమతి చేసుకుని అధిక లాభాలను పొందే అవ కాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఉద్యాన అధికారి జి.సురేష్ బాబు, కోడూరు ఉద్యానశాఖఅధికారి వెంకటభాస్కర్, రైతు సేవ కేంద్రసిబ్బంది, మామిడి రైతులు పాల్గొన్నారు.

కోనేటి సులోచనకు డాక్టరేట్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

డాక్టరేట్ అందుకుంటున్న కోనేటి సులోచన

సమాజ సేవా కార్యక్రమాలలో తనదైన పాత్ర పోషిస్తున్న మదనపల్లె పట్టణానికి చెందిన నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఎపి మహిళ ప్రధాన కార్యదర్శి కోనేటి సులోచనకు అరుదైన గౌరవం లభించింది. ఆమె సేవలను గుర్తించి యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ సంస్థ డాక్టరేట్ కు ఎంపిక చేసింది. బుధవారం తమిళనాడు రాష్ట్రం పాండిచ్చేరిలో జరిగిన కార్యక్రమంలో జాతీయస్థాయిలో వివిధ రంగాలలో విశేష సేవలు అందించిన పలువురిని గుర్తించి డాక్టరేట్లను ప్రదానం చేసింది. ఇందులో భాగంగా కోనేటి సులోచనకు అత్యుత్తమ సేవల విభాగంలో డాక్టరేట్ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన సేవలను గుర్తించి తనకు డాక్టరేట్ అందించిన యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ డాక్టరేట్ తన బాధ్యతను మరింత పెంచిందని, ఇదే స్ఫూర్తితో సేవాకార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తానని స్పష్టం చేశారు. దేశంలోని ప్రముఖుల సమక్షంలో డాక్టరేట్ అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనకు డాక్టరేట్ రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. డాక్టరేట్ అందుకున్న కోనేటి సులోచనను పట్టణంలోని పలువురు ప్రముఖులు అభినందించారు.

తాగునీటి ఎద్దడి నివారణపై ప్రత్యేక దృష్టి : ఎంపిపి



మాట్లాడుతున్న ఎంపిపి విజయభాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలో తాగునీటి ఏద్దడి నివారణ పై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలోని ఎంపిపి ఛాంబర్‌లో సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో మంచినీటి సమస్యలను పరిష్కరించే విధంగా ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. సచివాలయాల పరిధిలో ప్రజలకు సంబంధించి వివిధ సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు వెళ్లాలన్నారు. ఎంపీ నిధులతో మంజూరైన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని చెప్పారు. మండల పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడే రీతిలో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాధాకృష్ణన్ పాల్గొన్నారు.

జవహర్ నవోదయకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

హరిణి గగన సింధు

చేనేత కార్మికుడి ఇంట విద్యా కుసుమం వికసించింది. మదనపల్లె మండలం, కోళ్లబైలు పంచాయతీ, వెంకటేశ్వరపురంలో నివాసం ఉంటున్న వేల్పుల శివప్రసాద్, వేల్పుల శోభ కుమార్తె హరిణి 6వ తరగతి ప్రవేశాలకై నిర్వహించిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో సత్తా చాటింది. ఇటీవల విడుదలైన ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించి జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికైంది. ప్రస్తుతం వెంకటేశ్వరపురంలోని ఎంపిపి పాఠశా లలో 5వ తరగతి చదువుతోంది. ఈ సందర్భంగా హరిణి తల్లిదండ్రులు మాట్లా డుతూ మా కుమార్తె చిన్నతనం నుంచి చదువుపై ఎంతో మక్కువ కలిగి ఉండేదన్నారు. హరణి ఆసక్తిని చూసి జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు చేయించామన్నారు. పట్టుద లతో చదివి మంచి మార్కులతో జవహర్ నవోదయకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. ఇందుకు సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. **పుల్లంపేట:** మండల కేంద్రంలోని శ్రీ ప్రత్యూష హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని యు.గగన సింధు నవోదయ ఆరవ తరగతి ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించింది. ప్రవేశ పరీక్షల ఫలితాలు విడుదల కాగా గగన సింధు ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు శ్రీ ప్రత్యక్ష హైస్కూల్లో చదివి నవోదయ ప్రవేశ పరీక్షల్లో పరీక్ష రాసి సీటు సంపాదించింది. నవోదయ పరీక్షల్లో ఉత్తీర్ణత కావడం పట్ల ప్రత్యూష స్కూల్ కరస్పాండెంట్ శ్రీ కాసుల భానుప్రసాద్, ప్రధానోపాధ్యాయులు జి.సుబ్బనరసింహులు, ప్రిన్సిపల్ టివి రాజశేఖర్, ఉపాధ్యాయులు రవీంద్రబాబు, షబీనా, నాగలక్ష్మి, రాధా, వాసుదేవరాజు, సురేష్, సరళమ్మ, ప్రసన్న బాబు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

నేడు కో-ఆప్షన్ సభ్యుడి ఎన్నిక

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మండల ప్రజా పరిషత్ పాలకమండలిలో కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎన్నికల అధికారి అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పీలేరు మండల ప్రజా పరిషత్‌కు ఉన్న కో-ఆప్షన్ సభ్యులు మృతి చెందడంతో కొత్తగా మరో కో-ఆప్షన్ సభ్యుడిని ఎందుకు అవడం కోసం, గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కో-ఆప్షన్ సభ్యుడు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని అన్నారు. 12 గంటలకు నామినేషన్ల పరిశీలన, అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కో-ఆప్షన్ సభ్యుడిని ఎంపిటిసిలు ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేసుకోవాలని తెలిపారు.

అన్నమాచార్యుడి కీర్తిని ప్రపంచానికి చాటిచెబుదాం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పద కవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల కీర్తిని ప్రపంచానికి చాటి చెబుదామని టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు పేర్కొన్నారు. బుధవారం అన్నమాచార్య 522 వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాటాడుతూ వెంకటేశ్వర స్వామికి అత్యంత ప్రియమైన భక్తునిగా పేరుందిన అన్నమాచార్యులు మన ప్రాంతం వారవడం ఎంతో గర్వించదగ్గ విషయమని, ఆయన ఖ్యాతితోపాటు ఆయన పుట్టిన నేలలో మనం తిరుగుతుండడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. ఆయన కీర్తిని ప్రపంచానికి చాటి చెబుతూ, ఆయన జన్మస్థలాన్ని ప్రపంచంలోనే ఒక ప్రఖ్యాత ప్రాంతంగా రూపుదిద్దుకునేలా ప్రతి ఒక్కరం కలిసి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట రాజంపేట టిడిపి మండల అధ్యక్షుడు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు, టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, తెలుగు యువత నాయకులు పాండురాజు, ఆనంద్, పరుశురాం నాయుడు, మోహన్, లక్ష్మీనారాయణ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నకేశ్వర స్వామి సన్నిధిలో జగన్‌మోహన్‌రాజు

నూతనంగా నిర్మించిన శ్రీ రామాలయం

2 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

26వ తేదీన పుల్లంపేట మండల పరిధిలోని వత్తులూరులో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఏప్రిల్ 2 నుంచి మూడు రోజులపాటు విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు విలేకరుల సమావేశంలో తెలిపారు. 2న ప్రత్యేక పూజ, హోమ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 3న మూలమంత్ర జపం,నవగ్రహ జపములు, దీక్షా హోమం, సాయంత్రం అష్టోత్తర శత దీపాలంకరణ సేవ, వేద పారాయణం, శయ్యాదివాసం, పుష్పాదివాసం, మంత్రపుష్పం కార్యక్రమాలు జరుగుతున్నట్లు పేర్కొ న్నారు. 4న ఉదయం 9 గంటల 20 నిమిషాల నుంచి సీతారాముల విగ్రహ శ్రీ సీతా లక్ష్మణ హనుమంత సమేత శ్రీరామ విగ్రహ ప్రతిష్టాపన ఉంటుందని, అనంతరం కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇంటి స్థలంలో అక్రమంగా చేపడుతున్న గుడి నిర్మాణం

పట్టాభూమిలో ఆలయ నిర్మాణం

- ఫిర్యాదు చేసినా పట్టని రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వం మంజూరు చేసిన పట్టా భూమిలో కొందరు వ్యక్తులు ఆలయ నిర్మాణం చేపడుతు న్నారని, ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదంటూ బాధితులు ఆరోపించారు. మదనపల్లె మండలం, వలసపల్లె పంచాయతీ, బొగ్గిటివారిపల్లెకు చెందిన నాగయ్య, రాధమ్మ దంపతులకు ప్రభుత్వం ఇంటిపట్టాను మంజూరు చేసింది. అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు వీరికిచ్చినా పట్టా స్థలంతో పాటు మరికొంత ప్రభుత్వ భూమిలో గంగమ్మ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. పట్టాభూమిలో గంగమ్మ ఆలయ నిర్మాణంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితులు వాపోతున్నారు. ఇంతవరకు సొంత ఇళ్లు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయానికి మరోచోట భూమిని కేటాయించి తమకు కేటాయించిన స్థలాన్ని అప్పగించాలనిబాధితులు కోరుతున్నారు.

సిసి కెమెరా నిఘాలో వేలం నిర్వహించాలి

ప్రజాశక్తి-పీలేరు

గ్రామ పంచాయతీ వేలం పాటలను సిసి కెమెరాల పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహిం చాలని ఎన్ఎస్‌డబ్ల్యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృతతేజ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఈవోను తన కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందించారు. పీలేరు గ్రామపంచాయతీ పరిధిలోని షాపింగ్ గదులు, వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్, జంతువుల వధశాల, మాంసపు అంగళ్ళకు సంబంధించి గురువారం అటెండర్లు నిర్వహించను న్నారు. అయితే ఈ బహిరంగ వేలంపాటలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించాలని, టెండర్ కాల పరిమితిని మూడేళ్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఆయన పంచాయితీ ఇఒ గురు మోహన్ కు వినతిపత్రం సమర్పించారు. ఎఎన్ఎస్‌యుఐ ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్‌తేజ ఆధ్వర్యంలో పీలేరు మేజర్ గ్రామపంచాయతీ ఇఒ గురుమోహన్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అమృత్ తేజ మాట్లాడుతూ పీలేరు గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి 19వ తేదీన పరిధిలోని షాపింగ్ గదులు, వారపు సంత, దినసరి మార్కెట్, ప్రయివేట్ బస్టాండ్, జంతువుల శాల మాంసపు అంగళ్ళకు సంబంధించి బహిరంగ వేలంపాట నిర్వహించడానికి ప్రకటన జారీ చేసిన విషయంగా అందరికీ విధితమే అన్నారు. ఈ వేలంపాట ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, న్యాయంగా ఉండాలంటే సిసి కెమెరాల పర్యవేక్షణలో వేలంపాటలు నిర్వహించాలని విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకుల మహేష్, మంజునాథ్, భాను, లిఖిత్, ఆదిత్య, స్వామి, సాయి పాల్గొన్నారు.

ఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఎన్ఎస్‌యు ఐనాయకులు

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రెడ్డిశివ(ఫైల్ ఫొటో

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిన చెందిన సంఘటన బుధవారం మండలంలో వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. కొత్తపల్లికి చెందిన రంగస్వామినాయుడు కుమారుడు రెడ్డి శివ(40) గ్రామానికి సమీపంలోని చెట్టుకు ఉరికి వేలాడుతూ మృతి చెందడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెడ్డిశివ వ్యవసాయంతోపాటు పాడి ఆవులు మేపుకొని పాలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనకు గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మత్తు పదార్థాలకు బానిసైన యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం మదనపల్లె లో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చంద్రాకాలనీకి చెందిన అవాజ్ పట్టణంలోని ఓ సెల్ షాపులో పని చేస్తున్నాడు. ఇటీవల స్నేహితులతో కలిసి హన్స్, సిగరెట్స్, మద్యం వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి బానిసగా మారాడు. అర్ధరాత్రి సమయంలో తూలుతూ ఇంటికి వెళ్లాడు. ఉదయాన్నే తల్లిదండ్రులు మందలించారు. మత్తుకు బానిస అయిపోయావని మంచిపద్ధతి కాదని దండించారు. మనస్తాపానికి గురైన అవాజ్ శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అప్రమత్తమైన తల్లిదండ్రులు మంటలను అదుపుచేసి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి రెఫర్ చేశారు.

మహారాజరాజశ్రీ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో

I.A.No. 301/2024
O.S.No. 159/2014

మదిరెడ్డి వాణి, భర్త క్రిష్ణారెడ్డి, వయస్సు 37 సం॥, వడిశలవంకపల్లె,H/o గోరాన్‌చెరువు,గాలివీడు మండలము, అన్నమయ్య జిల్లా. ...పిటిషనర్/వాది

Vs

R27. కొండ్రెడ్డి పూజిత, D/o చిన్నపరెడ్డి, వయస్సు 32 సం॥, హిందు, R/o పక్కీర్‌రెడ్డి గారిపల్లె, గాలివీడు టౌన్, మండలము, అన్నమయ్య జిల్లా. ...రెస్పాండెంట్ నెం.27

నోటీసు ప్రకటన

పై నెంబరు యొక్క దావా పిటిషనరు ప్రతివాదులపై భాగపరిష్కారము కొరకు డాక్యుమెంట్స్ రద్దు కోరుతూ దావా దాఖలు చేసియున్నారు. 5వ ప్రతివాది అయిన కె.చిన్నపరెడ్డి చనిపోయినందున అతని వారసురాలైన కె.పూజిత అయిన మిమ్ములను 27వ రెస్పాండెంట్‌గా చేర్చుటకు పిటిషన్ దాఖలు చేసియున్నారు. మీకు ఏమైన ఆక్షేపణలు వున్న ఎడల 1.4.2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు సదరు కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

కె.ఈశ్వరయ్య, M.Com., B.L.,
పిటిషనరు తరపున న్యాయవాది,
రాయచోటి.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) రాజంపేట

I.P. No : 05/2025

గంజికుంట వెంకటస్వామి, S/o వెంకటసుబ్బయ్య, D/No: 1/5, కొత్త సింగనమల, పెనగలూరు మండలం, అన్నమయ్య జిల్లా. ...పిటిషనర్

V/s

కొత్త వెంకటసుబ్బయ్య, S/o సిద్దయ్య, వెంకట రాజంపేట (v), H/o కొనాపురం, నందలూరు మండలం, అన్నమయ్య జిల్లా. ...రెస్పాండెంట్

నోటీసు

పై కనిన పిటీషనర్ తనను ఇన్‌సాల్వెంట్‌గా ప్రకటించమని రెస్పాండెంట్ పైన పై కోర్టు వారి ఎదుట పిటిషన్ దాఖలు చేసియున్నందున ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల శ్రీ కోర్టు వారి ఎదుట తేదీ 02-04-2025 న ఉదయం 10 గంటలకు మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మనవి చేసుకొనవలయును. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

//By Order of the Court//

M.D.నిజాం జానీ,
ప్రభాకర్ రావ్,
అడ్వకేట్స్,
రాజంపేట.